క్లుప్తంగా

పండుగలా ఆయిల్‌పామ్ పంట కోత



పూజలు చేయిస్తున్న రైతు దంపతులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్‌కు చెందిన రైతు అన్నల తిరుపతి మొట్టమొదటగా చేతికి వచ్చిన ఆయిల్‌పామ్ పంట తీయడాన్ని పండుగలా నిర్వహించాడు. గ్రామ సమీపంలో ఆరు ఎకరాల్లో గత మూడేళ్ల క్రితం ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడు. ప్రస్తుతం పామాయిల్ చెట్లకు పంట చేతికి రావడంతో శుక్రవారం తన చేనులో పూజార్లతో ప్రత్యేక పూజలు చేయించి పండుగలా పంట కోత చేపట్టారు. కుటుంబ సభ్యులతోపాటు పంట కొనే మ్యాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులు, కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామానికి చెందిన రైతు సుంకే నగేశ్ ఇంట్లో కోటపల్లి మండల ఫారెస్టు అధికారులపై చొరబడి మహిళలపై అనుచితంగా ప్రవర్తించినవారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఫారెస్టు కన్జర్వేటర్ శాంతరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ అమాయక రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అకారణంగా దాడి చేసి రైతు కుటుంబాన్ని ఇబ్బంది పెట్టిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం ఆశోక్, నాయకులు రామయ్య, శంకర్, నగేశ్ పాల్గొన్నారు.

ఫిషరీస్ డైరెక్టర్‌కు సన్మానం

పాతమంచిర్యాల: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిషరీస్ కోఆపరేటివ్ లిమిటెడ్ డైరెక్టర్‌గా ఎన్నికైన బోరే యాదగిరిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో గంగపుత్ర, వాడబలిజ సేవా సంఘాల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ గంగపుత్రులు, వాడబలిజ కులస్తులకు ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేస్తామన్నారు. తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నెన్నెల నర్సయ్య, విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టెల రమేశ్, వాడబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్, నాయకులు చందు, వేణుగోపాల్, రాజన్న, సత్తయ్య, రాజు, గట్టయ్య, రమేశ్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

కోటపల్లి: కోటపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఈసంవత్సరం నుంచి ఇంటర్ ప్రవేశాలు చేపట్టనున్నట్లు ఎస్‌వో హరిత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం 2025–26న పదో తరగతి పాసై ఇంటర్ బైపీసీలో చేరబోయే విద్యార్థినులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం

తాండూర్: ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ఇరువురు విద్యార్థులను శుక్రవారం డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన మాదారం గ్రామానికి చెందిన పులగం కిరణ్ 1000 మార్కులకు 901 మార్కులు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిన ఇందూరి శృతి 992 మార్కులు తెచ్చి ప్రతిభావంతంగా రాణించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వారికి శాలువ కప్పి సత్కరించారు. నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు దామోదర్‌రెడ్డి, సుభాష్, పర్వత్‌రావు, మల్లేశ్, పుట్ట శ్రీనివాస్, లక్ష్మణ్, బానేష్, శ్రీనివాస్, రాజారాం పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టిసారించాలి

మందమర్రిరూరల్: గ్రామల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలను ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. పారిశుధ్య నిర్వహణపై తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులను పరిశీలించారు. కాలువల్లో దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, చెత్త డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అద్దెకు ఖాళీ స్థలం!

- ఫుట్‌ఫాత్ స్థలం కూడా..
- కబ్జా చేస్తున్న షాపుల యజమానులు
- వీధి వ్యాపారులకు సబ్ లీజు
- ఆదాయం పొందుతున్న వైనం



ఫుట్‌పాత్ స్థలంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు, రోడ్డుపై పార్కింగ్ చేసిన బైక్‌లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారుఏరియా ప్రధాన రహదారికి ఇరువైపులా షాపుల ముందు ఉన్న ఖాళీ స్థలాలు కొందరికి లాభసాటిగా మారాయి. ఖాళీ స్థలంతోపాటు ఫుట్‌ఫాత్ స్థలాన్ని కబ్జా చేసి షాపుల యాజమానులు అద్దెకు ఇస్తున్నారు. తమ స్థలం కాకపోయిన షాపు ముందు ఉండడంతో యాజమానులుగా భావించి వీధి వ్యాపారులకు సబ్ లీజుకు ఇచ్చి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాన్ని వదిలేయాల్సి ఉండగా అదేమి పట్టించుకోకుండా పది అడుగుల ఖాళీ స్థలం ఉన్న సరే అన్యాక్రాంతం చేసుకుంటున్నారు. బీఆర్ అంబేద్కర్ (కాంటా) చౌరస్తా వద్ద నుంచి పాతబస్టాండ్ వరకు ఇదే తంతు కొనసాగుతోంది. కొందరు బడా వ్యాపారులు షాపు ముందు ఉన్న ఖాళీస్థలంలో, ఫుట్‌పాత్‌పై వస్తు సామగ్రి ఉంచి వ్యాపారం సాగిస్తున్నారు. ఈతీరు కొంతకాలం నుంచి యథేచ్ఛగా సాగుతోంది. రోడ్డు పక్కన ఫుట్‌ఫాత్ లేకుండా చేసి ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నారు. ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి అద్దెకిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

రూ.వేలల్లో అద్దె వసూలు

ఖాళీ స్థలాల్లో రెడీమెడ్ వస్త్రాలు, బ్యాంగిల్స్, జ్యూస్ సెంటర్లు, పూలు, పండ్లు, మసాలా దినుసులు, టిఫిన్, టీ, సమోసా, మిర్చి, బొండాలు తదితర రకాల అమ్మకాలు చేస్తున్నారు. కొందరు షాపుల యాజమానులు రోడ్డు మురుగునీటి కాలువను ఆక్రమించి వీధి వ్యాపారులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. నెలకు ఒక్కోషాపు వద్ద నుంచి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. మరో మార్గం లేక అడిగినంత అద్దె చెల్లించి జీవనాధారాన్ని కొనసాగిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం..

రోడ్డును ఆనుకుని ఉన్న ఖాళీ, ఫుట్‌ఫాత్ స్థలాలు కబ్జాకు గురవుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ బైక్‌లు పార్కింగ్ చేయడానికి వీలు లేని పరిస్థితులు ఉంటున్నాయి. అనివార్యంగా షాపుల ముందు, ఫుట్‌ఫాత్‌పై నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. ఒక్కోసారి వాహన యాజమానుల మధ్య ఘర్షణ కూడా జరుగుతోంది. షాపుల యాజమానులు చీదరించుకోవడం చేస్తున్నారు. ఈక్రమంలో పోలీసులు వచ్చి పార్కింగ్ చేసి ఉన్న వాహనాల ఫొటోలు తీసి జరిమానా విధిస్తున్నారు.

కూల్చివేత యత్నాలతోనే సరి

పురప్రజలు, వాహనదారుల నుంచి విమర్శలు వచ్చిన ప్రతిసారి మున్సిపల్ అధికారులు రోడ్డు ముందు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లు, తోపుడు బండ్లు, టేలాలను కొన్నింటిని కూల్చివేసి చేతులు దులుపుకుంటున్నారు. శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవడం లేదు. రోడ్డు ముందు వస్తు సామాగ్రి ఉంచి వ్యాపారం సాగిస్తున్న బడా వ్యాపారుల జోలికి వెళ్లకుండా కేవలం చిరు వ్యాపారులపై ప్రకోపాన్ని చూపిస్తున్నారు. కూల్చివేత చర్యలకు పాల్పడిన తర్వాత మళ్లీ వ్యాపారులు యథావిధిగా షాపుల ముందు ఖాళీ స్థలాలను కిరాయికి ఇవ్వడం చేస్తున్నారు.

చర్చించి నిర్ణయం తీసుకుంటాం

ఖాళీ స్థలం అద్దెకు ఇస్తున్న వైనంపై చర్చ జరుగుతోంది. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టిలో ఉంది. త్వరలో సమావేశం నిర్వహించి చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటారు. ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వడం సరైంది కాదు. శాశ్వత చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ రూపొందిస్తాం.

– కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

'పోలీసుల దాడిని ఖండిస్తున్నాం'



నిరసన తెలుపుతున్న జన్నారం ప్రెస్‌క్లబ్ సభ్యులు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ శ్రేణులు, పాత్రికేయులు

జన్నారం: ఎలాంటి నోటీసు లేకుండా 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసానికి వెళ్లి భయభ్రాంతులకు గురిచేసిన ఏపీ పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు జన్నారం ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు చిలువేరు నరసయ్య అన్నారు. దాడిని ఖండిస్తూ జన్నారంలో శుక్రవారం జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకుని జర్నలిస్టులు, ఎడిటర్లను నియంత్రించుకోవాలనుకోవడం మతిలేని చర్యగా భావిస్తున్నామని తెలిపారు. తనిఖీలుగా పేరు చెప్పినా అది దాడిగానే భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి లింగన్న, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు వేణుగోపాల్, రమేష్ ప్రశాంత్ సత్యం మహేష్, శివరామకృష్ణ పవన్, శంకర్ నరసయ్య వెంకట్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పత్రిక స్వేచ్ఛకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు భంగం కలిగిస్తున్నారని సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, సాక్షి పాత్రికేయులు విమర్శించారు. 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంతకు ముందు ఆర్డీవో హరికృష్ణకు సాక్షి పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయిలు దాగం తిరుపతి, ఎనగంటి సంపత్‌రెడ్డి, గౌ సోద్దిన్ బాబా, దుర్గం మనోజ్, పానగంటి స్వామి, స్వచ్ఛంద సంస్థ నాయకురాలు దాసరి విజయ, సీపీఐ పట్టణ నాయకుడు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నవజాత కవలలకు మెరుగైన వైద్యం



నవజాత శిశువులతో వైద్యుడు రఘువంశీ

పాతమంచిర్యాల: నెలలు నిండక తక్కువ బరువుతో జన్మించిన నవజాత కవల శిశువులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు జిల్లాలోని అవని అస్పత్రి వైద్యుడు రుద్రబట్ల రఘువంశీ. వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం అచలాపూర్‌కు చెందిన కృష్ణవేణి పెళ్లయిన 13 ఏళ్ల తర్వాత గర్భం దాల్చింది. నెలలు నిండక ముందే నొప్పులు రావడంతో మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రి వెళ్లగా ఆమె కవల పిల్లలకు జన్మనిచ్చింది. వారు తక్కువ బరువుతో జన్మించడంతో శ్వాస సంబంధ సమస్య తలెత్తింది. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా వైద్యుడు రఘువంశీని సంప్రదించి ఆస్పత్రిలో చేర్పించారు. 34 రోజులపాటు చికిత్స అందించి ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత శుక్రవారం డిశ్చార్జీ చేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు వైద్యుడికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యుడు రఘువంశీ మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీతో కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని తమ ఆస్పత్రిలో అందిస్తున్నట్లు తెలిపారు.

ఇల్లు వద్దని ఉదారత చాటిన మహిళ



వెరిఫికేషన్ అధికారికి ఇల్లు వద్దని చెబుతున్న ఓదమ్మ

బెల్లంపల్లి: ప్రభుత్వ పథకాలను వద్దనుకునే వారు చాలా అరుదు. బెల్లంపల్లికి చెందిన ఓ దిగువ మధ్య తరగతి మహిళ తనకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి వదులుకుని ఉదారతను చాటుకుంది. బెల్లంపల్లి మున్సిపాలిటీ 31వార్డు మహ్మద్ ఖాశీంబస్తీలో నివాసం ఉంటున్న కేశవేణి ఓదమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఆ విషయాన్ని వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రకటించారు. కానీ ఓదమ్మ పెద్ద మనస్సు చేసుకుని తనకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని రద్దు చేసి మరో నిరుపేద మహిళకు కేటాయించాలని ఆ వార్డు ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ అధికారి, ఎంఈవో శ్రీధర్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆమెను బస్తీ వాసులు అభినందించారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



దండేపల్లిలో ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

దండేపల్లి: వరి ధాన్యం కొనుగోళ్ల వేగవతం చేయాలని డీఆర్‌డీవో కిషన్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని లింగాపూర్, నాగసముద్రం, దండేపల్లి, మామిడిపల్లి, నెల్కివెంకటాపూర్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడగా, పలు సమస్యలను ఏకరువు పెట్టారు. గన్నీ సంచులు లేవని, హమాలీల కొరత, లారీల కొరత వంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు. గన్నీసంచులు, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఏపీఎం బ్రహ్మయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనిత, సీసీలు కొమురవెల్లి, లావణ్య, తిరుపతిగౌడ్, వీవో లీడర్లు ఉన్నారు.

సైన్యానికి మద్దతుగా పూజలు



గూడెంలో పూజలు చేస్తున్న అర్చకులు, సిబ్బంది



మల్లన్న స్వామి ఆలయంలో..



శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో హోమం

దండేపల్లి/జైపూర్/బెల్లంపల్లిరూరల్/మందమర్రిరూరల్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ఉగ్రవాదులతో పోరాడుతున్న భారత్ సైన్యానికి మద్దతుగా దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కాంగ్రెస్ నాయకులు జైపూర్ మండలం వేలాల శ్రీ మల్లన్న స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ప్యాగ లక్ష్మణ్, డేగ నగేశ్, శిషిందర్‌యాదవ్, రాజేశ్, సమ్మయ్య, వినయ్, తదితరులు పాల్గొన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు పూజలు నిర్వహించి హోమం చేపట్టారు. ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావాలని కోరుతూ మొక్కుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీదేవి, నాయకులు గోవర్ధన్, సంగీత, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా దాడి చేపట్టినందుకుగాను మందమర్రిలోని పాతబస్టాండ్ కూడలి వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు డీవీ దీక్షితులు, రమేశ్, వ్యాపార సంఘం నాయకులు ఉన్నారు.

కూల్‌డ్రింక్ తాగి అస్వస్థత



మాట్లాడుతున్న ఎస్సై సురేశ్

లక్సెట్టిపేట: మజా కూల్‌డ్రింక్ తాగి ఒకరు అస్వస్థతకు గురైన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మున్సిపల్ పరిధి గోదావరి రోడ్‌లోని ఓ కిరాణా షాపులో పట్టణానికి సాయి శుక్రవారం మజా బాటిల్ కొనుగోలు చేసి ఇంటికి వెళ్లాడు. తన కూతురు తాగగా వాంతులు చేసుకోవడంతో వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మజా శీతల పానీయం తాగి అస్వస్థతకు గురైందని వైద్యులు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు షాపు వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఎస్సై గోపతి సురేశ్ అక్కడికి చేరుకున్నారు. మజా బాటిళ్లను పరిశీలించి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సింగరేణి సమస్యలపై మంత్రికి వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్టీయూసీ నాయకుల బృందం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. శుక్రవారం యూనియన్ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బీ.జనక్‌ప్రసాద్ నేతృత్వంలో నాయకులు హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. అనంతరం సింగరేణి సీఎండీ యన్.బలరాంనాయక్‌ను కలిసి వారి సమస్యలను వివరించారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శులు వికాస్‌కుమార్, రాజేందర్, అక్రమ్, నాయకులు కలవేన శ్యామ్, నరేందర్, శేషారత్నం, దాస్, సదానందం, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులు రక్షణ చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న జీఎం దేవేందర్, పక్కన అధికారులు

బెల్లంపల్లి: కార్మికులు రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలని మందమర్రి ఏరియా జీఎం జి.దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శాంతిఖని గనిని జీఎం సందర్శించారు. భూగర్భగని మ్యాప్, ప్లాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీగా సాధిస్తున్న బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను కార్మికులు పెంచాలన్నారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు వెలికితీతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్లప్పుడు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఇందుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు కలిసికట్టుగా శ్రమించాలన్నారు. అనంతరం శాంతిఖని భూగర్భంలో దిగి పనిస్థలాలను పర్యవేక్షించారు. ఆయనవెంట శాంతిఖని గ్రూప్ ఆఫ్ మైన్స్‌ఏజెంట్ అబ్దుల్ ఖాదిర్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, అధికారులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సంఘాల విలీన సభను జయప్రదం చేయండి

రామకృష్ణాపూర్: భూపాలపల్లిలో ఈనెల 11న జరిగే సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రెండు యూనియన్ల విలీన సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం పిలుపునిచ్చారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కొన్నిఅనివార్య కారణాలతో 2013లో ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రెండుగా విడిపోయిందని, ప్రస్తుతం రెండు సంఘాలు ఒకటిగా పనిచేసేందుకు విలీనసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మల్లేశ్, శివ అప్పారావు ఉన్నారు.

కనీస పెన్షన్ రూ.వెయ్యి అమలు

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ అయిన కార్మికులకు కనీస పెన్షన్ రూ.వెయ్యి చెల్లించనున్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అలవేందర్ వేణుమాధవ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద గోదావరిఖని, కొత్తగూడెం సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్లకు లేఖలు రాయగా వారు స్పందిస్తూ మార్చి 8 నుంచి కనీస పెన్షన్ అమలు చేస్తున్నట్లు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. కంపెనీ వ్యాప్తంగా 1818 మంది పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో వారి పెన్షన్ నిలుపుదల అయినట్లు వివరించారు. వారు వెంటనే ఆన్‌లైన్‌లో జీవన్ ప్రమాణ్ పత్రాన్ని సమర్పించి పెన్షన్ పొందాలని సూచించారు.

లెదర్ పార్క్ ప్రారంభించాలి



మాట్లాడుతున్న రమేశ్

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించి వెంటనే ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లెదర్ ఇండస్ట్రీస్ పార్క్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాత్తూరి రమేశ్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లెదర్ పార్క్‌షెడ్‌ను సందర్శించి పరిస్థితులపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ లెదర్ పార్క్ కోసం 25 ఎకరాలు కేటాయించినా పరిశ్రమ ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతె స్వామి, నాయకులు కొలుగూరి విజయ్‌కుమార్, చిలుక రాయనర్సు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరి లక్ష్మణ్, సంగి సంతోష్, కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

'సిబిల్ స్కోర్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి'

బెల్లంపల్లి: రాజీవ్ యువ వికాస్ పథకం లబ్దిదారుల ఎంపిక కోసం సిబిల్ స్కోర్ ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువకులకు రాయితీతో అందజేసే రుణాల కోసం సిబిల్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకోవడం సరికాదన్నారు. లిడ్ క్యాప్ ద్వారా చెప్పుల ఉత్పత్తి ప్రారంభించి దళితుల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు, నాయకులు దుర్గయ్య, రాజ్‌కుమార్, శివాజీ, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

జైపూర్: మండలంలోని మిట్టపల్లిలో ప్రజల తాగునీటి సౌకర్యార్థం కొత్త బోరు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు తెలిపారు. కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు స్థానిక నర్సరీ వద్ద బోరు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం నర్సరీని సందర్శించారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



వేడుకల్లో అర్చకులు, భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలోని శ్రీ శివరామాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి కల్యాణం కనుల పండువగా జరిగింది. గ్రామంలో ప్రారంభమైన ఐదురోజుల జాతర మహోత్సవాల్లో భాగంగా కల్యాణాన్ని అర్చకుడు ముత్యాల రమాకాంత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు ఉత్సవమూర్తులను అలంకరించి గ్రామవీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో శివపార్వతులకు కల్యాణం జరిపించారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అనతంరం వారు తీర్థప్రసాదాలు స్వీకరించారు.